క్లుప్తంగా

సిటిజన్ యాప్‌లో మారిన పేరు



కమిషనర్‌గా నాగేందర్ పేరు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల సిటిజన్ బడ్డీ యాప్‌లో కమిషనర్ పేరు మారింది. కమిషనర్ రాజేంద్రకుమారేనా? పదవీ విరమణ పొందినా ఆయన పేరే.. అంటూ సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ప్రజాప్రతినిధుల స్థానంలో ప్రత్యేక అధికారి అని సవరించారు.

'మేరా రేషన్.. మేరా అభియాన్'పై శిక్షణ



శిక్షణ తరగతులకు హాజరైన రైతులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి రైతువేదికలో 'మేరా రేషన్ మేరా అభియాన్'పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ మల్బరీ నాణ్యత, ఆకు నిర్వహణ పద్ధతులపై రైతుకు బుధవారం అవగాహన కల్పించారు. సిద్దిపేట ఏడీఎస్ ఇంద్రాసేనారెడ్డి పట్టుపురుగుల పెంపకం.. వాటి సామర్థ్యంపై రైతులతో మాట్లాడారు. అనంతరం డాక్టర్ రాఘవేందర్ పట్టుపురుగు తెగులు, వ్యాధి నిర్వహణ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు శివకుమార్, రాకేశ్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, కొమురయ్య పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగు



పరికరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రహీం

మద్దూరు(హుస్నాబాద్): టీఎల్‌ఎమ్‌తో అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగవుతాయని తహసీల్దార్ రహీం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓ వరదరాజు ఆధ్వర్యంలో బుధవారం టీఎల్‌ఎమ్ మేళా నిర్వహించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన పరికాలను తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి అద్భుతమైన పరికరాలు తయారు చేశారన్నారు. బోధన సామర్థ్యాలు పెంచుకొని విద్యార్థులకు మంచి విద్య అందించాలని సూచించారు. అనంతరం విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ



మృతుని తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మేనల్లుడు జంగపల్లి మణివర్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కొడుకుని కోల్పోయిన తల్లిదండ్రులను వారు ఓదార్చారు. వారి వెంట మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాంరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాంరెడ్డి సూచించారు. మండలంలోని తిగుల్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 24 మంది లబ్ధిదారులకు 15 మంది నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన ఎనిమిది మందికి మొదటి విడతగా వారి ఖాతాలో రూ.లక్ష జమచేసినట్లు తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ విశాఖ, కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న బీజేఆర్ చౌరస్తా

అదుపు తప్పితే అంతే..

- రెయిలింగ్ లేక తరచూ ప్రమాదాలు
- ఇప్పటికే ఇద్దరు మృతి
- రక్షణ చర్యలు చేపట్టాలి: వాహనదారులు



సిద్దిపేట బీజేఆర్ చౌరస్తా వద్ద వాహనాల రద్దీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటకు ముఖ ద్వారంగా ఉన్న బీజేఆర్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ఈ చౌరస్తా వద్ద ఏదో ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. సిద్దిపేట నుంచి హైదరాబాద్, వరంగల్, మెదక్‌కు వెళ్లే వాహనాలు ఈ చౌరస్తా నుండే వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఈ చౌరస్తాలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఉంది. అయితే ఆ విగ్రహం చుట్టూ మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఆహ్లాదకరంగా ఉండేందుకు వాటర్ ఫౌంటేన్, గ్రీనరీ ఏర్పాటు చేశారు. దీంతో చౌరస్తా విస్తీర్ణం పెరిగింది. అదేవిధంగా ఈ చౌరస్తా ఆవరణలోనే అనేక వ్యాపార సముదాయాలు, హోటళ్లు ఏర్పాటయ్యాయి.

రక్షణ గ్రిల్స్ కరువు

చౌరస్తా వద్ద ఎలాంటి రక్షణ గ్రిల్స్ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రక్షణ గ్రిల్స్ ఉంటే అనేక ప్రమాదాలు తప్పేవని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికే ఈ చౌరస్తాలోని డివైడర్ ఎత్తు లేకపోవడం ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అతివేగంతో రావడంతో చౌరస్తా వద్ద వేగం అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఫౌంటేన్‌లో పడి..

ఈ చౌరస్తాలోని వాటర్ ఫౌంటేన్‌లో పడి ఇప్పటి వరకు ఇద్దరు మృతి చెందారు. సిద్దిపేట అర్బన్ మండల వెల్కటూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి ఈ వాటర్ ఫౌంటేన్‌లో పడి మృతి చెందగా సోమవారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. ఇప్పటికైనా మున్సిపల్‌శాఖ అధికారులు ఈ చౌరస్తా చుట్టూ ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసి, ప్రమాదాలు నివారించాలని పట్టణవాసులు, వాహనదారులు కోరుతున్నారు.



వాటర్ ఫౌంటేన్‌లో గుర్తించిన మృతదేహం(ఫైల్)

నివారణ చర్యలు తీసుకోండి



బీజేఆర్ చౌరస్తాలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ చౌరస్తా వద్ద రక్షణకు ఐరన్ గ్రిల్స్ లేకపోవడంతో అదుపుతప్పిన వాహనదారులు నేరుగా వాటర్ ఫౌంటేన్‌లో పడి మృతి చెందుతున్నారు. అందువల్ల అధికారులు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలి, అదేవిధంగా చౌరస్తా రక్షణ గోడ ఎత్తును పెంచాలి.

– కిషన్, సిద్దిపేట పట్టణవాసి



బెజ్జంకిలో టోకెన్ల కోసం రోడ్డుపై బైఠాయించిన రైతులు

కనీసం టోకెన్లయినా ఇవ్వండి

- యూరియా కోసం రైతుల ఆందోళన
- వ్యవసాయాధికారులతో వాగ్వాదం

యూరియా కొరతపై రైతుల ఆందోళన కొనసాగుతూనే ఉంది. బుధవారం కూడా అన్నదాతలు యూరియా కోసం పడిగాపులు పడ్డారు. బెజ్జంకి, దుబ్బాక, మద్దూరులో రైతులు రోడ్డెక్కారు. ఆయా రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ల దగ్గర గుమిగూడారు. రోజులు గడిచినప్పటికీ పంటలకు సమయానికి యూరియా వెయ్యలేకపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందారు. యూరియా బస్తాలు ఇవ్వకున్నా టోకెన్లయినా ఇవ్వాలని బెజ్జంకి సహకార సంఘం వద్ద రైతులు ఆందోళన చేశారు. అలాగే దుబ్బాక ఆగ్రోస్ రైతు సేవ కేంద్రానికి 460 బస్తాల యూరియా రావడంతో రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూ లైన్‌లో నిలబడ్డారు. ఓపిక నశించి క్యూ లైన్‌లో చెప్పులు పెట్టారు. వ్యవసాయశాఖ అధికారులు లారీ లోడు రాగానే టోకెన్లు అందజేసి ఒక్కోరైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళనకు దిగిన రైతులకు మండల వ్యవసాయాధికారి నాగరాజు, గజ్వేల్ పోలీసులు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించేశారు.



రాయపోల్‌లో బారులు తీరిన అన్నదాతలు



మద్దూరు రైతు వేదిక వద్ద గుమిగూడిన రైతులు

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



విద్యార్థికి ఐడీ కార్డు అందజేస్తున్న ఎంపీ చామల

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. దూళ్మిట్టలోని 17 పాఠశాలల్లోని 900 మంది విద్యార్థులకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టై, బెల్ట్, ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనగామ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు, జాలపల్లి మాజీ ఎంపీటీసీ చెట్కూరి కమలకర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు సీయం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కమలాయపల్లి, అర్జున్‌పట్ల గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీలు గిరి కొండల్‌రెడ్డి, కొమ్ము నర్సింగరావు, బైరాన్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, దూళ్మిట్ట మండల యూత్ ఉపాధ్యక్షుడు మల్లేశం, కాంగ్రెస్ నాయకులు కనుకచంద్రం, రాజు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లలో రాజీ పడొద్దు

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: వినాయక విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లలో రాజీపడొద్దని, నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాల్లో బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు, కుంటల్లో చెత్తాచెదారం తొలగించి, పారిశుద్ధ్య నిర్వహణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. నిమజ్జనం చేసిన మరుసటి రోజే చెరువుల్లో నుంచి విగ్రహాలు తొలగించాలని, పూజ సామగ్రి చెరువుల్లో వేయకుండా చూడాలని చెప్పారు. అనంతరం పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మున్సిపల్ అనుమతి ఆధారంగా ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికుమార్ శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు. కోమటి చెరువు వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ పరిశీలించారు.

క్రీడలతో మానసిక దృఢత్వం మెరుగు

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



చిన్నకోడూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ

మర్కూక్(గజ్వేల్): క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈఓ వెంకట్ రాములు అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. మొదటిరోజు అండర్14, అండర్ 17 విభాగాలలో ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పోటీ వాతావరణంలో ఈ క్రీడలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దామోదర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, బీఆర్‌ఎస్ నేత కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశం, శ్రీనివాస్‌రావు, కుమార్, బాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటయ్య, బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యరాజ్ సేవలు భేష్

ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని పేద విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న దాత జీఆర్ సూర్యరాజ్ సేవలు మరువలేనివని డీఈఓ కొనియాడారు. మర్కూక్ జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.10 లక్షల విలువైన 20 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను సూర్యరాజ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, క్రీడాదుస్తులు, సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు.

క్రీడలతోనే నైపుణ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడలు యువతలో నైపుణ్యాన్ని వెలికి తీస్తాయని మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ యాదవరెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీతత్వం ముఖ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): పోటీతత్వంతో ఆడినప్పుడే క్రీడల్లో విజయం సాధించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకటనర్సయ్య అన్నారు. స్థానిక పాఠశాలలో మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఎంపీడీఓ జయరాం, ఎంఈఓ రంగానాయక్, ఎస్‌ఐ ప్రశాంత్, హెచ్‌ఎంలు సంధ్య, జ్యోతి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, చంద్రారెడి పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటాలి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను ప్రతిభ చాటాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. ఓ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. కొండపోచమ్మ చైర్మన్ అనుగీత, తహసీల్దార్ నిర్మల, ఎంఈఓ మాధవరెడ్డి, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేతలు వెంకట్రామిరెడ్డి, శంకర్, సత్తయ్య, సైదులు, కనకయ్య పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు..

కొండపాక(గజ్వేల్): చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని ప్రముఖ జానపద ఫోక్ డ్యాన్సర్ జానులిరి అన్నారు. కుకునూరుపల్లి హైస్కూల్లో నిర్వహించిన మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన కుకునూరుపల్లి హైస్కూల్ జట్టుకు బహుమతి అందజేశారు. ఎంఈఓ సత్తయ్య, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదలకు దోహదం

దౌల్తాబాద్(దుబ్బాక): పిల్లలు మానసికంగా ఎదగడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎంఈఓ గజ్జెల కనకరాజు అన్నారు. ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఆయన బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం అనిల్ కుమార్, గోపాల్‌రెడ్డి, నర్సింహులు, గోవర్ధన్‌రెడ్డి, హరికృష్ణ, సత్యనారాయణ, మహేశ్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడారంగంలోను రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి సూచించారు. మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ అలవర్చుకున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, బీఆర్‌ఎస్ నేత అంజిరెడ్డి, లింగం, సత్యనారాయణ, మల్లేశం, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించు.. వినాయకా

వినాయక నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు గణపతి మండపాల వద్ద భక్తులు బుధవారం గణేశుడిని విశేషంగా అలంకరించారు. హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల భక్తిశ్రద్ధలతో విగ్రహ నిమజ్జనాలు నిర్వహించారు.



హుస్నాబాద్: వినాయకుడికి 108 రకాల స్వీట్లతో నైవేద్యం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గణనాథుడికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత హరికృష్ణ తదితరులు



మిరుదొడ్డి(దుబ్బాక): నిమజ్జనంలో విద్యార్థులు



చిన్నకోడూరు(సిద్దిపేట): గోనెపల్లిలో..

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఏఐఎస్‌ఎఫ్

- ఘనంగా 90వ వారోత్సవాల సభ ముగింపు
- ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు పవన్



మాట్లాడుతున్న పవన్

చేర్యాల(సిద్దిపేట): భారతదేశ విద్యార్థి ఉద్యమాల వేగుచుక్కగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐఎస్‌ఎఫ్ మాత్రమేనని ఆ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు మంద పవన్ అన్నారు. 90వ వారోత్సవాల ముగింపు సభ పట్టణ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 యేళ్ల చరిత్ర కలిగిన ఏఐఎస్‌ఎఫ్‌లో చేరి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, అశోక్, నరేశ్, ప్రసన్నకుమార్, శిరీష, భూమయ్య, భాస్కర్‌రెడ్డి, రమణాకర్, నవీన్, యాసిన్, భరత్, ప్రశాంత్, అభినవ్, సంజయ్ పాల్గొన్నారు.

అవగాహన లోపంతో ఇబ్బందులు

సిద్దిపేటజోన్: ప్రభుత్వ సంక్షేమ, ఇతర ధ్రువీకరణ పత్రాల విషయంలో ఇంటర్‌నెట్ నిర్వాహకుల అవగాహన లోపంతో దరఖాస్తులు చేయడంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మీ సేవ సిద్దిపేట అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు యూసుఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ ఇంటర్‌నెట్ సెంటర్లను ఆశ్రయించి ఇబ్బందులు పడొద్దని సూచించారు. సరైన పద్ధతిలో పత్రాలు అప్‌లోడ్ చేయకపోవడంతో రెవెన్యూ కార్యాలయంలోదరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చెరువులను పరిశీలించిన ఏసీపీ

గజ్వేల్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవాలు జరుపుకోవాలని ఏసీపీ నరసింహులు సూచించారు. నిమజ్జనం జరిగే చెరువులను బుధవారం ఆయన సీఐ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ మారుతితో కలిసి పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

◆ ముదిరాజులపై చిన్నచూపు తగదు

చిన్నకోడూరు(సిద్దిపేట): ముదిరాజులపై పాలకుల చిన్నచూపు తగదని, సంఘటితంగా పోరాడాలని ముదిరాజు హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం చిన్నకోడూరులో మాట్లాడుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తప్ప ముదిరాజులకు న్యాయం జరగడం లేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ముదిరాజులు వెనుకబాటుకు గురవుతున్నారని వాపోయారు. వెంకటేశం, ప్రశాంత్, బాలేశ్ తదితరులు ఉన్నారు.

◆ చట్టాలపై అవగాహన అవసరం

ములుగు(గజ్వేల్): మహిళల భద్రత కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా భద్రత, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

◆ క్రీడా దుస్తులు అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వట్టిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన తాడూరి జయశ్రీ జ్ఞాపకార్థంగా రిటైర్డు ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డి క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వంద మంది విద్యార్థులకు దుస్తులు అందించామన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, కొండపోచమ్మ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

◆ మత్తు పదార్థాలకు బానిస కావద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఐ సైఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

◆ దివ్యాంగుల ఉచిత నిర్ధారణ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ, సమగ్రశిక్ష జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగుల ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 70 మందికి పరీక్షలు నిర్వహించి, కావాల్సిన పరికరాలను నిర్వాహకులకు అందించారు. జిల్లా కోఆర్డినేటర్ రంగనాథ్, ఎంఈఓ రాజ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం విజయ్‌కుమార్, భవిత కేంద్రం నిర్వాహకురాలు సునీత పాల్గొన్నారు.

◆ ఇసుక మేటల పరిశీలన

దౌల్తాబాద్(దుబ్బాక): ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని గాజులపల్లి పొలాల్లో వేసిన ఇసుక మేటలను ఏఈఓ సంతోష్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గాజులపల్లిలో సుమారు 30 ఎకరాల వరి పొలాల్లో ఇసుక మేటలు వేసినట్టు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఆయన వెంట రైతులు శ్రీనివాస్, స్వామి, వెంకటి, రాజయ్య, మల్లారెడ్డి, కనకారెడ్డి, ప్రేమ్‌కుమార్, కనకగౌడ్, లక్ష్మి ఉన్నారు.

◆ మంత్రి వివేక్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భవన నిర్మాణ రంగాల కార్మికులకు లబ్ధి చేకుర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం హర్షించదగిన విషయమని భవన నిర్మాణరంగాల కార్మికులు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్, రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ గంగాధర్, భవన నిర్మాణరంగాల కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఫ్లెక్సీలకు భవన నిర్మాణరంగాల కార్మికులు క్షీరాభిషేకాలు చేశారు.

◆ ఉచిత నేత్ర వైద్యశిబిరం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో బుధవారం ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షించిన వైద్యులు ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని సిద్దిపేట ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు బాపురెడ్డి, మాదయ్య, రంజిత్, కన్నయ్య, బాల్‌లింగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.